తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
07-08-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 180
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## దిల్లీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు

- 32 నెలల్లో 75 సార్లు దిల్లీకి
- దిల్లీకి సామంతులుగా కాదు స్వతంత్రులుగా వుండాలి
- కేసీఆర్ చేతిలో తెలంగాణను పెట్టడమే జయశంకర్ సార్‌కు అసలైన నివాళి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

- జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఆగస్టు 6 సిరి న్యూస్ :**
రాష్ట్రంలో గత 20 నెలల కాలంలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మిగతా 2వ పేజీలో..




# టెండర్ లో వండర్!

- ఒక్క సంస్థ కోసం నిబంధనలే మార్చేశారు
- ఏకంగా పదేళ్లకు కాలపరిమితి
- ఆ కంపెనీ అర్హతలే ఇక్కడ నిబంధనలు
- చిన్న కాంట్రాక్టర్లను తొక్కెయ్యడానికి కుట్ర
- స్ట్రీట్ లైట్ టెండర్లలో డొంకతిరుగుడు లెక్కలు
- రూ.1341 కోట్ల ప్రాజెక్టు నోటిఫికేషన్ పై అన్ని అనుమానాలే?
- క్యూర్ పరిధిలో విధి దీపాల నిర్వహణ టెండరు దాఖలుకు నేడే చివర తేదీ

**నిఘా విభాగం, సిరి న్యూస్:**
ప్రభుత్వ పెద్దల అండదండలతో హైదరాబాద్ మహానగరం వీధి దీపాల టెండర్ల వ్యవహారం ఒక సంస్థ.. దాని పరిమితులు.. అందుకు అనుగుణంగా నిబంధనలు అనే తీరుగా మారాయి. సివిసి మార్గదర్శకాలను పక్కనపెట్టి మరి కేవలం ఒక సంస్థకు ఉన్న అర్హతలనే నిబంధనలుగా మార్చి పదేళ్ల పాటు నిర్వహణ చేసేలా టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నిబంధనల మార్పుపై కాంట్రాక్టరులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన పట్టించుకోకుండా టెండర్ల ఖరారుకు మున్సిపల్ శాఖ సర్వం సిద్ధం చేసింది.

**ఇదివరకు నిర్వహణ ఇలా?**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో ఇదివరకు విడి దీపాల నిర్వహణ కోసం టెండర్ పొందిన సంస్థ మూడేళ్ళ పాటు కాలపరిమితితో ఆ పనులను దక్కించుకొంది. ఆలా 2016 నుండి ఇప్పటివరకు అదే సంస్త కాలపరిమితి పెంపు మూలంగా నిర్వహణ చేస్తూ వస్తోంది. కానీ ఇప్పుడు కొత్త నిబంధన ప్రకారం కాల పరిమితి 10 ఏళ్ళు పెంచడం వెనకాల అధికార పార్టీ పెద్దల అండదండలతో అనుకున్న వారికీ పనులు అప్పజెప్పాలన్న ఆలోచన ఉన్నట్టు అర్థమవుతోంది.

**కొత్త నిబంధనలు ఇవే..**
10 ఏళ్ల పాటు విడి దీపాల నిర్వహణ కోసం హైదరాబాద్ లోని మూడు మున్సిపాలిటీల పరిధిలో1341 కోట్ల కు టెండర్ బిడ్ ఆహ్వానించారు. అయితే ఇందుకు

మిగతా 3వ పేజీలో..

## ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

2

- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులను అందజేయనున్న ప్రభుత్వం
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం.. 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ
- పర్యవేక్షణ బాధ్యతలు ఆర్డీవోలకు అప్పగింత



## గోదావరి ప్రాజెక్టులకు సమాధి



- ఎపి డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్ఎంబీ
- తెలంగాణకు జై అనని రేవంత్ సిఎంగా ఉన్నారు
- మాజీ మంత్రి హరీష్ రావు
- జయశంకర్‌కు నివాళులు

**సిద్దిపేట, ఆగస్ట్ 6, సిరి న్యూస్ :**
తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని, జై తెలంగాణ అని ఏరోజూ అనని వ్యక్తి ఈరోజు సీఎంగా ఉన్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం,

మిగతా 2వ పేజీలో..

## లీగల్ నోటీసులకు భయపడను

- హరీశ్ రావు క్షుద్ర పూజలపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- సీఎంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం
- సమన్వయ కమిటీలో బహిరంగంగానే చర్చలు జరిగాయని వ్యాఖ్య
- ఆధారాలు ఉంటే ఆడియోలు, వీడియోలు బయటపెట్టాలని సవాల్



**హైదరాబాద్, సిరి న్యూస్:**
బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పంపిన లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల్లో ఎలాంటి అసత్యం లేదని, అవసరమైతే న్యాయస్థానంలోనే అన్ని విషయాలకు సమాధానం ఇస్తానని అన్నారు. హరీశ్ రావు క్షుద్ర పూజలకు సంబంధించిన ఆరోపణలపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని మరోసారి డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, హరీశ్ రావును వ్యక్తిగతంగా కించపరచలేదని, తప్పుడు ప్రచారం కూడా చేయలేదని చెప్పారు. ఆయన సందర్శించిన ఆలయాలు క్షుద్ర పూజలకు ప్రసిద్ధి చెందినవని ప్రచారం ఉన్న నేపథ్యంలో, ఆ ఆలయాలకు ఎందుకు వెళ్లారో స్వయంగా

మిగతా 2వ పేజీలో..

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

- మరో 48 కాలేజీల చిట్టాను అందచేసిన హైడ్రా
- కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం

2




## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

- ప్రశ్నిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ



**హైదరాబాద్, ఆగస్ట్ 6, సిరి న్యూస్:**
ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు

మిగతా 3వ పేజీలో..



## సింగరేణికి నైనీ నల్ల బంగారం

- తెలంగాణ ఇంధన భద్రతలో చారిత్రక ఘట్టం
- ఒడిశా నుంచి జైత్రయాత్రగా రాష్ట్రానికి వచ్చిన నల్ల బంగారం
- 1,131 కి.మీ ప్రయాణించి సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరిన తొలి రేక్
- అమెరికా నుంచి శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి

**మంచిర్యాల, ఆగస్టు 6, సిరి న్యూస్ :**
రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చే దిశగా సింగరేణి చరిత్రలో అత్యంత అద్భుతమైన, చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్లతరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్.. ప్రజా ప్రభుత్వం రాకతో, పాలకుల చిత్తశుద్ధితో ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా, ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే □రేక్ సుమారు 1,131 కి.మీ ప్రయాణం పూర్తి చేసి గురువారం ఉదయం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ)కి చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సింగరేణి గని నుంచి రాష్ట్రానికి బొగ్గు సరఫరా కావడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో ఎస్టీపీపీలో పండగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఇంధన భద్రతలో ఇది ఒక సువర్ణాధ్యాయం.

**నేడు సాకారమైన స్వప్నం**
కేంద్ర బొగ్గు శాఖ 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను

మిగతా 2వ పేజీలో..

## సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతికత

- కొత్త బ్లాకుల అభివృద్ధి, గనుల్లో భద్రతే లక్ష్యంగా కసరత్తు
- కేటర్‌పిల్లర్, కొమాట్సు సందర్శించిన డిప్యూటీ సీఎం, సింగరేణి అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 6. సిరి న్యూస్ :**
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి, జిమ్కో (జేఎంఎంకో లిమిటెడ్) సీనియర్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి బృందం అమెరికాలో పర్యటిస్తోంది. ఈ బృందం టెక్సాస్, అరిజోనా రాష్ట్రాల్లో ఉన్న ప్రఖ్యాత మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను గురువారం సందర్శించింది. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడం, తద్వారా గనుల్లో భద్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఈ పర్యటనకు శ్రీకారం చుట్టాయి. ముందుగా అరిజోనా రాష్ట్రం టక్సన్‌లోని కేటర్‌పిల్లర్ డెమాన్‌స్ట్రేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి బృందం

మిగతా 2వ పేజీలో..



# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

**మొదటిపేజీ తరువాయి**

జయశంకర్ సార్ ఆరాటం వల్లే అని చెప్పారు. గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తు చేసిన హరీష్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్చాలని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. శాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ఏపీ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఫ్లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# లీగల్ నోటీసులకు భయపడను: మహేష్ కుమార్ గౌడ్

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించాలని కోరారు. రాష్ట్రానికి ఎవరు మేలు చేశారో, ఎవరు నష్టం కలిగించారో ప్రజలే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశంపై వస్తున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సభ్యులందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించారని, ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి కమిటీ ముందు వివరించాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీ, ప్రభుత్వం ఒకే దిశగా పనిచేస్తున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు పూర్తి సఖ్యత ఉందని స్పష్టం చేశారు. తనకు, ముఖ్యమంత్రికి మధ్య విభేదాలున్నాయనే ప్రచారాన్ని మహేష్ కుమార్ గౌడ్ కొట్టిపారేశారు. తాము తరచూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని, పార్టీకి సంబంధించిన అంశాలను ముఖాముఖిగానే చర్చించుకుంటామని తెలిపారు. తనపై ఆడియోలు, వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నవారు నిజంగా ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. బీజేపీ నేతల విమర్శలపైనా ఆయన స్పందించారు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు చేయడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యమని అన్నారు. నాయకత్వాన్ని వ్యక్తిగత అంశాలతో కాకుండా పనితీరుతో అంచనా వేయాలని వ్యాఖ్యానించారు.

# ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 6, సిరి న్యూస్:**

తెలంగాణలో కొత్త ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రతను మరింత విస్తరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ చేపట్టనున్నారు.

ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేయనున్నారు.

పంపిణీ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించారు. పంపిణీ కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమం పూర్తయిన అనంతరం నియోజకవర్గాల వారీగా పంపిణీ వివరాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.




# నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

**హైదరాబాద్,ఆగస్ట్ 6, సిరి న్యూస్:**

ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఎన్ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర ఎన్ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సింగరేణికి 'నైనీ' నల్ల బంగారం

**మొదటిపేజీ తరువాయి**

కేటాయించింది. అయితే అధికారంలో ఉన్న తొమ్మిదేళ్ళు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బ్లాక్‌ను గాలికి వదిలేసింది. దీంతో అనుమతులు రాక ప్రాజెక్టు పడకేసింది. కానీ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను తొలగించుకుంటూ చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా అయిన భట్టి విక్రమార్క అలుపెరగని కృషి చేశారు. స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లారు. 2024 జులైలో తొలిసారిగా ఒడిశా వెళ్లి అక్కడి ప్రభుత్వంతో, అధికారులతో జరిపిన చర్చలు సత్ఫలితాలు ఇచ్చాయి. అడ్డంకులన్నీ తొలగిపోవడంతో 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని డిప్యూటీ సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆరుగాలం శ్రమించిన ఫలితంగా నేడు నైనీ నుంచి తొలి బొగ్గు రేక్ తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు తరలింపు ఒక చారిత్రక అవసరం. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన ఈ థర్మల్ కేంద్రానికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు తొలి రైలు రేక్ ఏకంగా 1,131 కి.మీ ప్రయాణించింది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా నాలుగు వేల టన్నుల అత్యుత్తమ జీ10 గ్రేడ్ బొగ్గు సింగరేణికి చేరుకుని రాష్ట్ర ఇంధన రంగానికి కొత్త కళను తీసుకొచ్చింది.




**నైనీ గని ప్రత్యేకతలు ఇవే**

ఈ గని రాష్ట్ర విద్యుత్ రంగానికి రాబోయే దశాబ్దాలపాటు వెన్నెముకగా నిలవనుంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఇది మరో కలికితురాయిగా మిగిలిపోనుంది. 2015 ఆగస్టు 13న కేంద్ర ప్రభుత్వం సింగరేణి కేటాయించింది. 340.78 మిలియన్ టన్నులు వార్షిక బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం. ఏడాదికి కోటి టన్నులు (10 మిలియన్ టన్నులు). గని జీవితకాలం 36 సంవత్సరాలు. బొగ్గు నాణ్యత అత్యుత్తమ జీ10 గ్రేడ్.

**తొలి రైల్వే రేక్‌కు సింగరేణి అధికారుల ఘన స్వాగతం**

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకున్న తొలి నైనీ బొగ్గు రైల్వే రేక్‌కు సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ఈడిఎం) ఎం.తిరుమలరావు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కోల్ యార్డులో బొగ్గు అన్‌లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, తిరుమలరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేస్తూ నైనీ గని నుంచి బొగ్గు సరఫరా ప్రారంభించామని చెప్పారు. ఇప్పటివరకు సింగరేణి ఇతర రాష్ట్రాలకు బొగ్గు సరఫరా చేసిందని, అయితే ఇప్పుడు ఇతర రాష్ట్రంలోని తన గని నుంచి స్వరాష్ట్రానికి బొగ్గు తరలించడం సంస్థ చరిత్రలో అరుదైన ఘట్టమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ఇటీవల తాడిచెర్ల2, మణుగూరు డిప్‌సైడ్ బ్లాకులు సంస్థకు లభించాయని, త్వరలో మరికొన్ని గనులను కూడా సింగరేణికి సాధించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.చిరంజీవి, జనరల్ మేనేజర్ నర్సింహారావు, గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు వీరభద్ర, ప్రాతినిధ్య కార్మిక సంఘం నాయకుడు, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, ఇతర అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

**సింగరేణి మైనింగ్ ఇక విశ్వవ్యాప్తం**

**– అమెరికా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో సందేశం**

నైనీ బొగ్గు రాక సందర్భంగా ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడినుంచే సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు వీడియో సందేశం ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 'సింగరేణికి ఇది ఒక చరిత్రాత్మక సందర్భం. రాష్ట్ర అవసరాలు తీర్చడమే కాక దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా సింగరేణి బొగ్గును సరఫరా చేస్తోంది. పెరుగుతున్న రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మనం తాడిచర్ల2 బ్లాక్‌ను పొందాం. ఇటీవల వేలంలో మణుగూరు బ్లాక్‌ను దక్కించుకున్నాం. భవిష్యత్తులో మరిన్ని బ్లాకులను పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. రాబోయే వందేళ్లలో సింగరేణి కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాల్లోకి కూడా అడుగుపెట్టాలి. ప్రపంచంలోనే అత్యుత్తమ మైనింగ్ సంస్థలతో పోటీపడే స్థాయికి సింగరేణి ఎదగాలి. అందుకోసం ప్రపంచంలో ఎక్కడ అందుబాటులో ఉన్న అత్యాధునిక మైనింగ్ యంత్రాలనైనా తెచ్చేందుకు సిద్ధం. ఇందులో భాగంగానే క్యాటర్‌పిల్లర్ కంపెనీకి చెందిన ఆధునిక మైనింగ్ పరికరాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్ తరాలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించే ఈ నూతన ప్రక్రియ మొదలైన నేటి రోజు ఒక చరిత్రాత్మక దినంగా నిలిచిపోతుంది' అన్నారు. ఒడిశా నుంచి తెలంగాణకు తొలి బొగ్గు రవాణా విజయవంతం కావడంలో సహకరించిన తెలంగాణ ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, భారతీయ రైల్వేలు, సంబంధిత అధికారులు, ఉద్యోగులకు సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్టులో జేఎల్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం మన రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్తు ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ(ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఏఐ, డీప్‌టెక్, అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రం సిద్ధం చేస్తోందన్నారు.



**హైదరాబాద్‌కు 16% జాతీయ వాటా**

2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటులోనూ హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని చెప్పారు. దీంతో ఐటీ కేంద్రంగా మాత్రమే కాక అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచస్థాయి ఆవిష్కరణలకు వేదికగా నగరం ఎదుగుతోందన్నారు.

**1,600 మందికి ఉద్యోగాలు**

జేఎలఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎలఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది. కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈవో రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.50 కోట్ల విలువైన గంజాయి దహనం

**ఖమ్మం, ఆగస్టు 6:**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.3.50 కోట్ల విలువైన భారీ పరిమాణం గల గంజాయిని అధికారులు గురువారం దహనం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన మొత్తం 696.1 కిలోగ్రాముల గంజాయిని న్యాయపరమైన అనుమతులతో చట్టబద్ధంగా నిర్వీర్యం చేశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజల్ కమిటీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 32 కేసులకు సంబంధించిన గంజాయిని ఈ సందర్భంగా దహనం చేశారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా శాఖ నిబంధనలకు అనుగుణంగా గంజాయిని పూర్తిగా తగలబెట్టినట్లు అధికారులు తెలిపారు. కేసుల విచారణ పూర్తయిన అనంతరం కోర్టు అనుమతితోనే ఈ చర్య చేపట్టినట్లు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు మత్తు పదార్థాలను తరలించే ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు మరింత కట్టుదిట్టం చేశామని, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం కింద కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతికత

**మొదటిపేజీ తరువాయి**

సందర్శించింది. అక్కడ స్వయంచాలిత(అటానమస్), రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే భారీ మైనింగ్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించింది. ఓసీల్లో ఉపయోగించే భారీ యంత్రాల విడిభాగాలు, ఆపరేటర్ల శిక్షణ విధానాలు, భద్రతా వ్యవస్థల పనితీరు గురించి సాంకేతిక నిపుణులతో అధికారులు లోతైన చర్చలు జరిపారు. ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో మనుషులు నేరుగా పనిచేసే విధానం తగ్గించేందుకు ఉపయోగపడే 'టెలిరిమోట్ ఆపరేషన్ టెక్నాలజీ'పై ప్రతినిధి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతరం టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సమీపంలోని లాంగ్‌వ్యూలో ఉన్న కొమాట్సు మైనింగ్ కార్పొరేషన్ ఫెసిలిటీని కూడా బృందం సందర్శించింది. అక్కడ భారీ మైనింగ్ యంత్రాల తయారీ, అసెంబ్లింగ్ ప్రక్రియలను పరిశీలించింది. సింగరేణిలో యంత్రాల నిర్వహణ ఖర్చులు, డౌన్ టైమ్ తగ్గించడమే లక్ష్యంగా భవిష్యత్తులో సాంకేతిక సహకారం, విడిభాగాల లభ్యత, పరికరాల సరఫరా ఒప్పందాల తదితర అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆధునిక, స్వయంచాలిత యంత్రాలను వాడటం ద్వారా ఓపెన్‌కాస్ట్ గనుల్లో కార్మికుల భద్రతను గణనీయంగా పెంచడంతోపాటు ప్రమాదాల రేటును భారీగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



**భవిష్యత్తులో సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం**

ప్రపంచస్థాయి తయారీదారులతో నేరుగా చర్చలు జరపడం వల్ల యంత్రాల కొనుగోలులో మెరుగైన నిబంధనలు, వేగవంతమైన సర్వీసు, స్థానికంగా నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపడతాయి. సాంకేతిక బదిలీ ఒప్పందాల ద్వారా భవిష్యత్తులో తెలంగాణలోనే సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనిద్వారా సింగరేణి సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ లభించడంతోపాటు సంస్థ నిర్దేశించుకున్న దీర్ఘకాలిక కోల్‌టుక్లీన్‌ఎనర్జీ పరివర్తన లక్ష్యాలతో అనుసంధానం అయ్యేలా ఈ పర్యటన దోహదపడుతుంది. సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగా రెండు భారీ బొగ్గు బ్లాకులను దక్కించుకున్న నేపథ్యంలో అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తాడిచెర్ల ఓసీ2 బ్లాక్ నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించగా మణుగూరు పరిధిలోని 'పీకేఓసీ2 డిప్‌సైడ్' బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకుంది. తాడిచెర్ల బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, 4050 ఏళ్ల జీవిత కాలం ఉండగా పీకేఓసీ2 బ్లాక్‌లో 180 మిలియన్ టన్నుల నిల్వలు, 25 ఏళ్ల జీవిత కాలం ఉంది. సింగరేణి నిర్దేశించుకున్న వార్షిక వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఈ బ్లాకులు కీలకం కానున్నాయి. ఫలితంగా రాబోయే రోజుల్లో ఈ భారీ ఓసీ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున షావెల్స్, డంపర్లు, డ్రాగ్ లైన్లు, డ్రిల్లింగ్ సిస్టమ్స్ వంటి భారీ యంత్రాల అవసరం ఏర్పడనుంది. కేటర్‌పిల్లర్, కొమాట్సు వంటి అంతర్జాతీయ సంస్థల టెక్నాలజీని ముందుగానే అంచనా వేయడం ద్వారా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడానికి ముందే యంత్రాల కొనుగోలు, ఫ్లీట్ విస్తరణ, ఆటోమేషన్ ప్రణాళికలను సింగరేణి సిద్ధం చేసుకోగలుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రతినిధి ఆర్‌కే మిశ్రా, డెన్నిస్ తదితరులు పాల్గొన్నారు.

# దిల్లీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు

హైదరాబాద్, ఆగస్టు 6, సిరి న్యూస్:

తెలంగాణ ఆత్మగౌరవాన్నిదిల్లీ ముందు తాకట్టు పెట్టే రాజకీయాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ దిల్లీ పర్యటనలు చేయడంపై తీవ్ర విమర్శలు చేశారు. 32 నెలల్లో 75 సార్లు దిల్లీ వెళ్లారని, దాదాపు ప్రతి 13 రోజులకు ఒకసారి తిరుగుతున్నారని అన్నారు. దిల్లీకి సామంతులు కాకుండా స్వతంత్రులు కావాలి అని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పేవారని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రయత్నిస్తోందని, జీఆర్ఎంబీ ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే ఆధారాలతో వివరించారని చెప్పారు. దిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణ మళ్లీ తల్లడిల్లుతోందని, తెలంగాణ కోసం పుట్టిన నిఖార్సయిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఒక బీజేపీ ఎంపీ తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, అప్పులు, అభివృద్ధి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం వాటిని వినియోగించలేకపోతోందన్నారు. కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేస్తూ తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

**జయశంకర్ సార్ ఆశయ సాధనే అసలైన నివాళి**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ అన్నారు. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలిలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు. జయశంకర్ సార్‌తో పదేళ్ల పాటు కలిసి పనిచేసే అదృష్టం తనకు దక్కిందని కేటీఆర్ తెలిపారు. ఆయన ఒక ఎన్‌సైక్లోపీడియా, గొప్ప ఉపాధ్యాయుడని కొనియాడారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా భావించిన జయశంకర్ సార్, ఆయనకు గాడ్ ఫాదర్‌లా మార్గనిర్దేశం చేశారని చెప్పారు. స్వయం సమృద్ధి, ఆత్మగౌరవం, స్వయం పాలన అనే మూడు దశల ద్వారా తెలంగాణ సమాజాన్ని జయశంకర్ సార్ విశ్లేషించారని, పాలమూరు వెనుకబాటుతనాన్ని కూడా అదే కోణంలో వివరించారని అన్నారు. 2006, 2008 ఉప ఎన్నికల సమయంలో ఉద్యమానికి భావజాల వ్యాప్తి, ఆందోళన, డెమోక్రటైజేషన్ అనే మూడు పార్శ్వాలు ఉన్నాయని జయశంకర్ సార్ చెప్పారని గుర్తు చేశారు. యాచించి కాదు.. శాసించి తెలంగాణ సాధించాలి అనే ఆలోచనను కేసీఆర్‌లో నూరిపోసిన వ్యక్తి ఆయనేనన్నారు. ఉద్యమం భాస్వరంలా మండుతుంది.. తెలంగాణ తప్పక వస్తుంది అని జయశంకర్ సార్ తమకు ధైర్యం చెప్పారని, శ్రీకాంతాచారి వంటి అమరవీరుల త్యాగాలతో ఉద్యమం విజయవంతమైందన్నారు. ఢిల్లీలో జాతీయ మీడియాకు తెలంగాణ చరిత్రను, హైదరాబాద్ రాష్ట్ర ప్రత్యేకతను, ఫజల్ అలీ కమిషన్ సిఫార్సులను, ఆంధ్ర-తెలంగాణ విలీనానికి గల కారణాలను జయశంకర్ సార్ ఆధారాలతో వివరించేవారని తెలిపారు. తెలంగాణ ప్రజలను చిన్నబుచ్చే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించేవారని కేటీఆర్ అన్నారు. జయశంకర్ ఆశయ సాధన కోసం బీఆర్ఎస్ నిరంతరం పని చేస్తుందని, తెలంగాణను మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

## గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- **రైతులు సహకరించాలి: మంత్రి పొన్నం**

సిద్దిపేట ఆగస్టు 6, సిరి న్యూస్:

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగు నీరందించడం తన బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టు కాలువల భూసేకరణ కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.250 కోట్లు విడుదల చేసిందని, రైతులు భూసే కరణకు సహకరిస్తే పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయని, కుడి, ఎడమ కాలువల తో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో గురువారం పాల్గొన్న మంత్రి పొన్నం ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా కోహెడ మార్కెట్ కమిటీలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ కమిటీలో రూ.1.61 కోట్లతో నిర్మించనున్న ఓపెన్ షెడ్, ప్లాట్ఫారం, మీటింగ్ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కోహెడ మండలం ధర్మసాగర్పల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని పేర్కొన్నారు. కోహెడ తంగళ్లపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భూగర్భ జలాల సంరక్షణ కోసం బోర్వెల్ రీఛార్జ్ పాయింట్ల సంఖ్యను పెంచాలని సూచించారు.

## ఎఫ్‌టీఈల సమస్యల పరిష్కారానికి సానుకూలం

- **పే స్కేల్ అంశంపై సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చిస్తా**
- **గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



హైదరాబాద్, ఆగస్టు 6 , సిరి న్యూస్:

జీ రామ్ జీ చట్టం ద్వారా రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపినప్పటికీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగుల(ఎఫ్‌టీఈ) దశాబ్దకాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ బి.ఆర్.కే.ఆర్ భవన్‌లో ఉపాధి హామీ ఎఫ్‌టీఈ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో మంత్రి సీతక్క గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పే స్కేల్ అమలు, కేడర్ స్ట్రెంగ్త్ ఖరారు, బదిలీల విధానం, ఇతర సర్వీస్ అంశాలను జేఏసీ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2006లో డీఎస్సీ ద్వారా ఎంపికై దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ పే స్కేల్ అమలు కాలేదని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది కేవలం జీతాల సమస్య కాదని, తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. మొత్తం 3,800 మంది పనిచేస్తున్నామని, తమకు పేస్కేల్ అమలు చేస్తే నెలకు రూ.2.5 కోట్ల చొప్పున అదనపు భారం పడుతుందని తెలిపారు. రాబోయే నాలుగు నుంచి అయిదేళ్లల్లో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నందున ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా క్రమంగా తగ్గుతుందని వివరించారు. ఉద్యోగుల సమస్యలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందిస్తూ పే స్కేల్ అంశాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టికి తీసుకెళ్లి చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై తదుపరి చర్యలపై చర్చిస్తామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే పే స్కేల్ అమలుతో ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని అంచనా వేసిందని, అది ఏడాదికి రూ.30 కోట్ల వరకు ఉంటుందని వివరించారు. ఉద్యోగులు తొందరపాటు చర్యలకు దిగొద్దని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉన్నందున ఆందోళన అవసరం లేదని మంత్రి సూచించారు. జపాన్ తరహాలో ఎక్కువ పని చేసి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే మార్గాలు కూడా ఉన్నాయని, పని నిలిపివేయడం కంటే బాధ్యతాయుతమైన పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదని సూచించారు. ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నామని మంత్రి తెలిపారు.

**ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు**

కేంద్ర ప్రభుత్వ వాటా చెల్లించనందున మూడు నెలలుగా జీతాలు నిలిచిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి అనంతరం కేంద్రం నుంచి ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్రం అంగీకరించలేదని మంత్రి తెలిపారు. ఈ కారణంగానే జీతాలలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, సమావేశం జరుగుతుండగానే సీఎం కార్యాలయాన్ని సంప్రదించి ఈ అంశంపై ఆయనతో చర్చించేందుకు సమయం కోరినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. వీలైనంత త్వరగా పే స్కేల్ అమలుకు కృషి చేస్తామని హామీ ఇవ్వగా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని కోరిన కూలీలందరికీ పని కల్పించేందుకు అదనపు సమయాన్ని వెచ్చించడానికి కూడా సిద్ధమని అన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, ఎఫ్‌టిఈ జేఏసీ సభ్యులు ఎలబద్రి లింగయ్య, ఎ.అంజిరెడ్డి, ఎం.విజయ్ కుమార్, ఈ. వెంకట్రామిరెడ్డి, ఎం.మోహన్ రావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

**జయశంకర్ జయంతి వేడుకలు**

బీఆర్కే భవన్‌లోని 'సెర్ప్' కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి. మంత్రి సీతక్క జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో 'సెర్ప్' సీఈవో దివ్యా దేవరాజన్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# టెండర్ లో వండర్!

మొదటిపేజీ తరువాయి

సంబంధించి టెండర్లో పాల్గొనే బిడ్డర్ గడిచిన మూడేళ్ళలో 400 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి, 10 శాతం వార్షిక కాంపౌండ్ గ్రోత్ సాధించి ఉండాలి. అలాగే సంస్థ పేరున 131.16 కోట్లకు తగ్గకుండా బ్యాంకు బ్యాలన్స్ పత్రాన్ని సమర్పించాలి. గత ఏడేళ్లలో పురపాలక సంఘాల్లో 2 ఏళ్ళ పాటు కాంట్రాక్టు పనుల్లో నిర్వహణ అనుభవం కలిగి ఉండాలి.గతంలో 30 కోట్ల విలువైన పనులను చేసి ఉండాలి. గత ఏడేళ్లలో సింగిల్ కాంట్రాక్టు ద్వారా 7000 సీఎంఎంఎస్ యూనిట్లను సరఫరా చేసి , అమర్చిన అనుభవం కూడా కలిగి ఉండాలి. ఆ గ్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి. జాయింట్ వెంచర్ బాగస్వామ్యులలో 7000 సిసిఎంఎస్ యూనిట్లను తయారు. చేసిన అనుభవం కలిగి ఉండలు. అలాగే అతని టర్నోవర్ మూడేళ్ళలో ఎదో ఒక బిజినెస్ ద్వారా 400 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి.

**కాంట్రాక్టర్ల అభ్యంతరాలు ఇవే?**

ఇదే నిర్వహణకు సంబంధించి గతంలో ఉన్న నిబంధనలు పక్కనపెట్టి ఒక సంస్థ కు ఉన్న అర్హతలే నిబంధనలుగా మార్చారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.సెంట్రలైజ్డ్ కమాండ్ మానిటరింగ్ సిస్టం, ఒరిజినల్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్టరర్ క్రెడెన్షియల్ తప్పని సరి చేసారు. అయితే కేవలం అనుభవం ఉన్న కాంట్రాక్టర్లను పక్కనపెట్టేందుకే ఒకే ఆర్డర్ ద్వారా అనుభవాన్ని చూపమన్న నిబంధన పెట్టడం పై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సహజంగా చేస్తున్న పని విధానానికి సంబంధించి ఉన్న అనుభవం టర్నోవర్ లెక్కించాలి. కానీ ఒక సంస్థకు పనులు అప్పజెపేందుకు ఇలా కొత్త నిబంధనలు పెట్టడంపై కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు.

**సీవీసీ మార్గదర్శకాలు పక్కనపెట్టి**

కేంద్ర నిఘా కమిషన్, పబ్లిక్ ప్రొక్యూర్మెంట్ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ టెండర్లలో పారదర్శకతతో పాటు ఎక్కువ భాగస్వామ్యం ఉండాలన్న నిబంధన ఉంది.కానీ ఇక్కడ టెండర్లలో అర్హతలు ఉన్న వారిని పక్కన పెట్టడానికే కొత్తగా నిబంధనలు తెచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొత్త నిబంధన ప్రకారం బిడ్డింగ్ వేసే వారి సంఖ్య తగ్గి ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

**టెండర్ విలువ 1341 కోట్లు**

క్యూర్ పరిధిలో ఉన్న మూడు మున్సిపాలిటీలకు కలిపి 1341 కోట్ల విలువైన టెండర్లను స్ట్రీట్ లైట్ ల నిర్వహణకోసం గత నెల 22న టెండర్లను ఆహ్వానించారు. ఇందుకు సంబంధించి వీధిదీపాల నిర్వహణ 10 ఏళ్ళ పాటు నిర్వహించేందుకు వీలు కల్పించారు.ఈఎమ్డి 13.41 కోట్లుగా నిర్ణయించారు. దరఖాస్తు రుసుము మాత్రం 25,000 గా నిర్ణయించారు.నేటితో టెండరర్ బిడ్డింగ్ వేసేందుకు ఆఖరి తేదీగా పేర్కొన్నారు.

**ఎవరి కోసం ఇలా?**

తెలంగాణ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ నాయకునికి అత్యంత సన్నిహితంగా ఉన్న మరో నాయకునికి సంబందించిన సంస్థ కోసమే కొత్త నిబంధనలు ఏళ్లపాటు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**స్ట్రీట్ లైట్ లెక్కలివే !**

జీహెచ్ఎంసి లో 330487, సీఎంసి లో 185258,ఎంఎంసి లో 244846 లైట్లు ఉన్నాయి.





## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

మొదటిపేజీ తరువాయి

చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయట పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు.హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా రెండు రోజులపాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

## పదవుల భర్తీలో కాంగ్రెస్ తీరు సరిగా లేదు

- **ఎమ్మెల్సీ కోదండరామ్ పెదవి విరుపు**



హైదరాబాద్,ఆగస్ట్ 6, సిరి న్యూస్:

పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. తమకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

## ధాన్యం అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి: రామచందర్ రావు

- **రూ.500 కోట్ల విలువైన ధాన్యం అక్రమాలు జరిగాయని ఆరోపణ**
- **కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియపై పారదర్శక విచారణకు డిమాండ్**
- **దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన**
- **కొనుగోలు వ్యవస్థలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని విజ్ఞప్తి**



హైదరాబాద్, ఆగస్టు 6, సిరి న్యూస్:

రాష్ట్రంలో సుమారు రూ.500 కోట్ల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం అక్రమాలు జరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు జరిపించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

2023 నుంచి మిల్లర్లకు అప్పగించిన ధాన్యం, ప్రభుత్వానికి తిరిగి అందిన బియ్యం మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి చేరలేదన్న ఆరోపణలు వస్తున్నాయని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరిగి ఉండొచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారానికి, ప్రజా పంపిణీ వ్యవస్థకు అత్యంత కీలకమని రామచందర్ రావు అన్నారు. ప్రభుత్వ ధాన్యం మళ్లింపు వంటి ఘటనలు ఆర్థిక నష్టంతో పాటు రైతుల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో ఎవరైనా దోషులుగా తేలితే వారి హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియల్లో పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే సమగ్ర వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు.

భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, పారదర్శక విధానాలతో రైతులు, ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించాలని రామచందర్ రావు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

## హైడ్రాలో 150 ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్, ఆగస్టు 6, సిరి న్యూస్:

హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న హైడ్రాలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కాంట్రాక్టు ప్రాతిపదికన మొత్తం 150 పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశంగా నిలవనుంది.

ఈ నియామకాల్లో 100 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అసిస్టెంట్ పోస్టులు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు గరిష్ఠంగా 35 ఏళ్లలోపు ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా నిర్ణయించగా, డ్రైవర్ పోస్టులకు చెల్లుబాటు అయ్యే హెవీ వాహన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.

ఎంపిక పూర్తిగా శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా జరుగుతుంది. 800 మీటర్ల పరుగును 2 నిమిషాల 50 సెకన్లలో, 100 మీటర్ల పరుగును 15 సెకన్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే 4 మీటర్ల లాంగ్ జంప్, 7.2 కిలోల షాట్‌పుట్‌ను 6 మీటర్ల దూరం విసిరే పరీక్షలను కూడా నిర్వహించనున్నారు. ఈ నియామకాలకు రాత పరీక్ష ఉండదు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా హాజరు కావాలని అధికారులు సూచించారు.




# ఏఐ కంటెంట్‌పై కేంద్రం కఠిన నిబంధనలు

- ఏఐ రూపొందించిన ప్రతి కంటెంట్‌కు లేబుల్ తప్పనిసరి
- హానికరమైన పోస్టుల తొలగింపు గడువు 36 గంటల నుంచి 3 గంటలకు
- ఫిర్యాదుల పరిష్కారానికి కొత్త కాలపరిమితులు
- డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారంపై నియంత్రణే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 6, సిరి న్యూస్:**

కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా రూపొందుతున్న తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లను అరికట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఐటీ నిబంధనల్లో కీలక మార్పులను ప్రతిపాదించింది. కొత్త నిబంధనల ప్రకారం సోషల్ మీడియా వేదికల్లో ఏఐ ఆధారంగా రూపొందించిన ప్రతి కంటెంట్‌పై తప్పనిసరిగా 'ఏఐ' గుర్తింపు లేబుల్ ఉంచాల్సి ఉంటుంది. దీనివల్ల అసలు కంటెంట్, కృత్రిమంగా రూపొందించిన కంటెంట్‌ను వినియోగదారులు సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుంది.

ప్రభుత్వం లేదా కోర్టు ఆదేశాల మేరకు చట్టవిరుద్ధమైన లేదా హానికరమైన ఏఐ కంటెంట్‌ను తొలగించేందుకు సోషల్ మీడియా సంస్థలకు ప్రస్తుతం ఉన్న 36 గంటల గడువును కేవలం 3 గంటలకు కుదించాలని కేంద్రం ప్రతిపాదించింది. డిజిటల్ వేదికల్లో తప్పుడు ప్రచారం వేగంగా వ్యాపించకుండా అడ్డుకోవడమే ఈ నిర్ణయం ఉద్దేశంగా పేర్కొంది. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో కూడా సమయ పరిమితులను మరింత కఠినతరం చేయాలని కేంద్రం నిర్ణయించింది. సున్నితమైన అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను 24 గంటల బదులు 2 గంటల్లోనే పరిష్కరించాల్సి ఉంటుంది. ఇతర ఫిర్యాదుల పరిష్కార గడువును 72 గంటల నుంచి 36 గంటలకు తగ్గించాలని ప్రతిపాదించింది. డిజిటల్ వేదికల్లో పారదర్శకతను పెంచడం, వినియోగదారుల భద్రతను బలోపేతం చేయడం, ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఈ మార్పులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొత్త ప్రతిపాదనలపై అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం తుది నిబంధనలను అమల్లోకి తీసుకురానుంది.




# నిరుద్యోగంపైనే తదుపరి పోరాటం: సీజేపీ

- సెప్టెంబరులో 'క్యా బోల్తీ పబ్లిక్' జాతీయ కార్యక్రమం
- దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై అభిప్రాయ సేకరణకు సన్నాహాలు
- విద్యా వ్యయాలు, నిరుద్యోగాన్ని ప్రధాన అంశాలుగా తీసుకుంటామని వెల్లడి
- ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్య

**ఛత్రపతి శంభాజీనగర్, సిరి న్యూస్:**

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనల అనంతరం సీజేపీ తన తదుపరి కార్యాచరణను ప్రకటించింది. సెప్టెంబరులో "క్యా బోల్తీ పబ్లిక్" పేరుతో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, నిరుద్యోగ సమస్యను జాతీయ చర్చాంశంగా తీసుకువస్తామని ఆ పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే తెలిపారు.
మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటిపై ప్రజాభిప్రాయాన్ని సమీకరించే కార్యక్రమమే "క్యా బోల్తీ పబ్లిక్" అని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్వరలో రాంచీ పర్యటన కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.
విద్యారంగంలో ఫీజుల భారం రోజురోజుకూ పెరుగుతోందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని అన్నారు. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని విమర్శించారు.
జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలు కేవలం నీట్ పరీక్షకు మాత్రమే సంబంధించినవి కాదని, దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న విస్తృత సమస్యలకు ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పార్టీ మార్పులు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించారు.
న్యాయ వ్యవస్థ పనితీరుపైనా అభిజీత్ దీప్కే విమర్శలు చేశారు. కొన్ని కీలక అంశాల్లో వేగంగా విచారణలు పూర్తవుతున్నప్పటికీ, సాధారణ ప్రజలకు సంబంధించిన కేసులు మాత్రం దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రతి పౌరుడికి సమానంగా, త్వరితగతిన న్యాయం అందేలా వ్యవస్థలు పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# గోబర్ధన్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

- రూ.23,731 కోట్లతో పదేళ్లపాటు అమలు
- వ్యవసాయ, సేంద్రీయ వ్యర్థాలతో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి
- సీబీజీ ఉత్పత్తిని పదింతలు పెంచే లక్ష్యం
- అస్సాంలో రూ.8,970 కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టుకూ గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 6, సిరి న్యూస్:**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దేశంలో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రూపొందించిన 'గోబర్ధన్' (జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకం)కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే అస్సాంలో గువాహటి-తేజ్‌పూర్ నాలుగు లేన్ల జాతీయ రహదారి కారిడార్ అభివృద్ధికి కూడా ఆమోదం తెలిపింది.
గోబర్ధన్ పథకాన్ని రూ.23,731 కోట్ల అంచనా వ్యయంతో 202627 నుంచి 203536 వరకు పదేళ్లపాటు అమలు చేయనున్నారు. వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ప్రెస్‌మడ్, పట్టణ సేంద్రీయ వ్యర్థాలను కంప్రెస్డ్ బయోగ్యాస్, సేంద్రీయ ఎరువులుగా మార్చడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. దేశీయంగా సీబీజీ ఉత్పత్తిని గణనీయంగా పెంచి స్వచ్ఛ ఇంధన రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రం భావిస్తోంది.
గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి కేంద్రాలుగా తీర్చిదిద్దడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ వనరులు కల్పించడం కూడా ఈ పథకం ఉద్దేశాల్లో ఒకటిగా ప్రభుత్వం పేర్కొంది. వ్యర్థాలను సమర్థంగా వినియోగిస్తూ సర్క్యులర్ బయో ఎకానమీని బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపింది. మరోవైపు అస్సాంలో జాతీయ రహదారి-15 పరిధిలో గువాహటి-తేజ్‌పూర్ మధ్య 135.871 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్ నిర్మాణానికి రూ.8,970.20 కోట్ల వ్యయంతో కేబినెట్ ఆమోదం తెలిపింది. బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ విధానంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో తేజ్‌పూర్ బైపాస్ వద్ద భారత వైమానిక దళ అవసరాలకు అనుగుణంగా అత్యవసర విమాన ల్యాండింగ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుత జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు బైహాత చరియాలీ, సిపాఝార్, ఖరుపేటియా, దేకియాజులి, తేజ్‌పూర్ ప్రాంతాల్లో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఐదు ప్రధాన బైపాస్‌ల నిర్మాణంతో ప్రాంతీయ రవాణా వ్యవస్థకు గణనీయమైన ఊతం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# వివాహ రద్దు ఫత్వాలు చెల్లవు

- మతపరమైన కమిటీలకు అధికారం లేదు
- మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

**భోపాల్, ఆగస్టు 6, సిరి న్యూస్ :**




మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్‌దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది. ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు ప్రక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# తరుణ్ తేజ్‌పాల్‌కు కోర్టు షాక్

- లైంగిక దాడి కేసులో దోషిగా గోవా ధర్మాసనం నిర్ధారణ

**ముంబై, ఆగస్ట్ 6 , సిరి న్యూస్:**

తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను 2013 నాటి లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టులోని గోవా ధర్మాసనం దోషిగా నిర్ధారించింది. 2021లో మాపుసా కోర్టు ఇచ్చిన తీర్పును ఈ ధర్మాసనం రద్దు చేసింది. జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. అతడికి విధించిన శిక్షను ధర్మాసనం ప్రకటించనుంది. గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. కుమార్తె వయస్సు ఉన్న యువతితో అతడు ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. బాధితురాలు పదే పదే తిరస్కరించినప్పటికి తేజ్‌పాల్ తన ప్రయత్నాలను కొనసాగించాడని పేర్కొన్నారు. అదీకాక మ్యాగజైన్ సంపాదకుడిగా అతడు గౌరవమైన స్థానంలో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడు తరుణ్ తేజ్‌పాల్‌కు గరిష్టంగా శిక్ష విధించాలని ఈ సందర్భంగా కోర్టుకు తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. 2013లో గోవాలోని ఓ రిసార్ట్ వేదికగా తెహెల్కా పత్రిక థింక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మ్యాగజైన్ సంపాదకుడు తరుణ్ తేజ్ పాల్ తనపై లైంగిక దాడి చేశాడని సహోద్యోగి ఆరోపించారు. మరికొద్దిసేపట్లో కోర్టు అతడికి శిక్ష విధించనుంది. ఈ నేపథ్యంలో తేజ్‌పాల్ స్పందించారు. తనపై దయ చూపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తన వయస్సు 62 ఏళ్లని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాను బాధితుడినని నమ్ముతున్నానన్నారు. తనకు భార్య కూడా ఉందన్నారు. అంతుకు మించి చెప్పడానికి ఏ లేదంటూ తేజ్‌పాల్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

# హోటళ్లు, రెస్టారెంట్లలో ఉచిత తాగునీరు తప్పనిసరి

- మహారాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం
- నిబంధనలు పాటించని యజమానులపై కఠిన చర్యలు
- తాగునీరు అందుబాటులో ఉందని బోర్డులు ఏర్పాటు చేయాలి
- ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలంటూ డిమాండ్లు



**ముంబై, ఆగస్టు 6:**

హోటళ్లు, రెస్టారెంట్లకు వచ్చే వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రతి వినియోగదారుడికి ఉచితంగా సురక్షితమైన తాగునీటిని అందించడం తప్పనిసరి చేస్తూ కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొచ్చింది.
మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ప్రతి రెస్టారెంట్‌లో "ఉచిత సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంది" అనే బోర్డును స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. వినియోగదారులను తప్పనిసరిగా ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసేలా ఒత్తిడి చేయకుండా ఈ నిర్ణయం దోహదపడనుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించే హోటల్, రెస్టారెంట్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఉచిత తాగునీరు అందించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.
మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రశంసలు లభిస్తున్నాయి. ఇదే విధానాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని పలువురు వినియోగదారులు, నెటిజన్లు ప్రభుత్వాలను కోరుతున్నారు.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం
- సాధారణ వినియోగదారులకు ప్రభావం ఉండదని సంకేతాలు




డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు 2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది. ప్రస్తుతం యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది. అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

# తల్లి పాలే శ్రేయస్కరం

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారా గౌడ్




**పెద్ద శంకరం పేట, ఆగస్టు 6, (సిరి న్యూస్);**
పుట్టిన పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరం అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారా గౌడ్ అన్నారు. గురువారం నాడు మండల పరిధిలోని దానం పల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారా గౌడ్ మాట్లాడుతూ శిశువుకు తోలి ఆరు నెలలు తల్లి పాలే సంపూర్ణ పోషకాహార మని చెప్పారు. తల్లిపాలతో వ్యాది నిరోదక శక్తి పెరుగుతుందని తల్లులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచి కట్ట శంకర్, పంచాయతి కార్యదర్శి వెంకటరత్నం, ఉప సర్పంచ సంగయ్య, వార్డు సభ్యులు, పలువురు మహిళలు, ఇంకా అంగన్వాడీ టీచర్ లింగమణి, ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ శ్రీశైల, ఆశా వర్కర్ కాసు ఇంతరులు పాల్గోన్నారు.

# సీపీజీఈటీలో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సత్తా

- రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంక్ సాధించిన ఆర్. మోనిక
- ఉత్తమ ఫలితాలతో మెరిసిన రామాయంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల





**రామాయంపేట,ఆగష్టు 6 (సిరి న్యూస్)**
తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సీపీజీఈటీ (CPGET)2026 ప్రవేశ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి రామాయంపేట కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో సంగారెడ్డికి చెందిన ఆర్. మోనిక ఎం.ఎస్సీ కంప్యూటర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంక్ సాధించి సత్తా చాటుకుంది. అలాగే కృష్ణవేణి ఎం.ఎస్సీ ఫిజిక్స్ విభాగంలో 115వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ జే. సబిత మాట్లాడుతూ, ఈ ఫలితాలు కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని తెలిపారు. సీపీజీఈటీలో 200లోపు 8 మంది, 500లోపు 15 మంది విద్యార్థినులు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తూ, ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయాల్లో భాగస్వాములైన అధ్యాపక బృందాన్ని కూడా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్సీ మహిళా విద్యార్థినులకు ప్రవేశాలు కొనసాగుతున్నాయని, ఆసక్తి గల వారు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన బోధనతో పాటు ప్రభుత్వ పరంగా అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆమె సూచించారు.

# ప్రజాకవి గద్దర్‌కు తెల్లాపూర్‌లో ఘన నివాళులు..

- గద్దర్ ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి: మట్టి మేధావి సత్తయ్య..



**రామచంద్రపురం, ఆగస్టు 6 (సిరి న్యూస్):**
ప్రజాకవి, విప్లవ గాయకుడు గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా తెల్లాపూర్‌లోని గద్దర్ సర్కిల్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మట్టి మేధావి సత్తయ్య మాట్లాడుతూ, గద్దర్ తన జీవితమంతా ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం అంకితం చేసిన మహనీయుడని అన్నారు. తన పాటలు, రచనలు, ఉద్యమాలతో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి సమాజంలో చైతన్యాన్ని రగిలించిన ప్రజాకవిగా గద్దర్ చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం గద్దర్ చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్న సత్తయ్య, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. సమాజంలో అణచివేత, అసమానతలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువత, గద్దర్ అభిమానులు పాల్గొని గద్దర్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పిస్తూ ఘనంగా నివాళులర్పించారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి బాట

- సర్పంచ్ గంట రాణి సుధీర్

**మెదక్ ఆగస్టు 6 సిరి న్యూస్**



పాపన్నపేట మండలం అన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ విజయవంతంగా నిర్వహించారు గ్రామాభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథ కాలను ప్రతి కుటుంబానికి చేరవేయడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్ర మాలను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా ఈ గ్రామసభ జరిగింది. ఈ సంద ర్భంగా సర్పంచ్ గంట రాణి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామంలో తాగునీటి సరఫరా పారిశుద్ధ్యం వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, హరితహారం, ఉపాధి హామీ పనులు తదితర అంశాల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులు కూడా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు విలువైన సూచనలు చేయగా, వాటిని ప్రాధాన్యతతో అమలు చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలను సంరక్షించడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామసభలో మహిళలు, యువత, రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజలు-ప్రజాప్రతినిధులు-అధికారుల మధ్య సమన్వయంతో గ్రామాభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పారదర్శక పాలన ప్రజల భాగస్వామ్యమే గ్రామ ప్రగతికి పునాదని గ్రామ సభలో స్పష్టమైంది. ఇలాంటి గ్రామసభలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, అన్నారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషిస్తాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇ సందర్భంగా గ్రామ సెక్రటరీ దుర్గ భవాని ఉప సర్పంచ్ లింగం. నల్లోల శైలజ. సాకి జెపాల్ అంగన్వాడీ టీచర్స్ సురేఖ లలిత గౌడుగు వినోద బేగరి కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బెల్టు దుకాణాలే అడ్డాగా మారిన పల్లెలు

- గ్రామాలలో జోరుగా లిక్కర్ అమ్మకాలు

**మెదక్ ఆగస్టు 6 సిరి న్యూస్**



జిల్లాలోని గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు మండల కేంద్రాల్లోని లైసెన్స్ పొందిన వైన్‌షాపులకు మాత్రమే పరిమితమైన మద్యం విక్రయాలు ఉండేయి ప్రస్తుతం గ్రామాల్లో బెల్టు దుకాణాల రూపంలో విస్తరించాయని స్థానికులు చెబుతున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు క్వార్టర్లు, హాఫ్ బాటిళ్లు, బీర్లు సులభంగా లభిస్తున్నాయని దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం గణనీయంగా పెరిగిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిరాణా దుకాణాలు టీ స్టాల్లు పాన్ షాపులు, చిన్న హోటళ్లు గ్రామ శివార్లలోని తాత్కాలిక షెడ్లు కొన్నిచోట్ల నివాస గృహాలే అక్రమ మద్యం విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో చిన్నచిన్న పరిమాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నా గ్రామస్థులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వైన్ షాపులు మూసివేసిన తర్వాత కూడా బెల్టు దుకాణాల్లో విక్రయాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు కొన్నిచోట్ల ఫోన్ చేస్తే ఇంటి వద్దకే మద్యం చేరవేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి దీంతో గ్రామాల్లో అక్రమ విక్రయాల వ్యవస్థ మరింత విస్తరించిందని స్థానికులు అంటున్నారు గ్రామాల్లో మద్యం సులభంగా లభిస్తుండటంతో యువతలో వినియోగం పెరుగుతోందని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత కూలీ పనుల అనంతరం మద్యం సేవించడం చాలా మందికి నిత్యకృత్యంగా మారిందని చెబుతున్నారు కొందరు యువకులు కూలీలు రైతులు రోజు సంపాదించిన మొత్తంలో గణనీయమైన భాగాన్ని మద్యానికే వెచ్చిస్తున్నారని పేర్కొంటున్నారు దీంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని మహిళలు వాపోతున్నారు ఇంటి అవసరాలు పిల్లల చదువులు వైద్య ఖర్చులు వ్యవసాయ పెట్టుబడుల కంటే మద్యానికే ఎక్కువ డబ్బు వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతోందని చెబుతున్నారు మద్యం మత్తులో జరిగే కుటుంబ కలహాలు భార్యాభర్తల మధ్య వివాదాలు గ్రామాల్లో చిన్న చిన్న ఘర్షణలు పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరి మద్యం సేవించడం వల్ల మహిళలు, వృద్ధులు చిన్నారులు అసౌకర్యానికి గురవుతున్నారని అంటున్నారు. కొన్నిచోట్ల మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పాఠశాలలు అంగన్‌వాడీలు దేవాలయాలు, చెరువు కట్టలు, బస్ స్టాండ్ల సమీపంలో ఖాళీ మద్యం సీసాలు ప్లాస్టిక్ గ్లాసులు కనిపించడం సాధారణమైందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో పరిశుభ్రత దెబ్బతినడమే కాకుండా యువతకు తప్పు సంకేతాలు వెళ్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల పరిశుభ్రత సామాజిక వాతావరణం కుటుంబ జీవన విధానం అన్నీ ఈ అక్రమ విక్రయాల ప్రభావంతో మారిపోతున్నాయని పేర్కొంటున్నారు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎక్కడ బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారో గ్రామస్థులకు తెలిసినా, సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా స్పందన ఆలస్యమవుతోందని, దీంతో అక్రమ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని చెబుతున్నారు బెల్టు దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చట్టవిరుద్ధంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మహిళా సంఘాలు కూడా గ్రామాల్లో మద్యం విక్రయాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మద్యం కారణంగా కుటుంబాల్లో పొదుపు తగ్గిపోవడం అప్పులు పెరగడం పిల్లల చదువులు నిర్లక్ష్యానికి గురికావడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలను పూర్తిగా తొలగించి అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు కేవలం చట్ట ఉల్లంఘన సమస్య మాత్రమే కాకుండా సామాజిక ఆర్థిక కుటుంబ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్న అంశంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎక్సైజ్, పోలీసు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో గ్రామాల వారీగా నిరంతర తనిఖీలు నిర్వహించి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిష్పాక్షికంగా చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్... నలుగురికి అవయవ దానం






**పెద్ద శంకరం పేట, ఆగస్టు 6, (సిరి న్యూస్)**
పెద్ద శంకరం పేట పట్టణానికి చెందిన తోట రవీందర్ (35) గత ఆది వారం నాడు మండల పరిధి లోని మైసమ్మ ఆలయం వద్ద రెండు ఎదు రెదురు బైక్ లు డీ కొన్న ప్రమాదం లో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్ళిపోయారు. నిన్న ఉదయం అతను బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ప్రకటించారు. దాంతో ఆయన కుటుంబ సభ్యులు పెద్ద మనసు చేసుకుని రవీందర్ అవయవాలు దానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జీవన్ దాన్ ప్రతినిధులను సంప్రదించి అతని శరీర భాగాలు దానం చేసారు. అనంతరం గురువారం ఉదయం అతని భౌతిక కాయాన్ని అంత్య క్రియల కోసం పెద్ద శంకరం పేట కు తీసుకు వచ్చారు. అంబులెన్స్ ముందూ స్థానిక యువకులు రవీందర్ అమర్ రహే అంటూ ఇంటి వరకూ ర్యాలీ గా తీసుకు వచ్చారు. అతను మండల పరిధి లోని మల్కాపూర్ గ్రామంలో ఆర్ ఎం పీ గా సేవలు అందిస్తున్నారు. ఆ గ్రామంలో మంచి పేరు తెచ్చుకున్న రవీందర్ అంతిమ యాత్ర లో పాల్గొనేందుకు వందల సంఖ్యలో గ్రామస్తులు తరలి వచ్చారు. అశ్రు నయనాల మధ్య రవీందర్ అంత్య క్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మండల కేంద్రం కు చెందిన లొద్ద లక్ష్మణ్ కుమారుడు రవీందర్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయ తెలుసుకున్న స్థానిక శాసనసభ సభ్యులు డాక్టర్ పి సంజీవ రెడ్డి తో గురు వారం పెద్ద శంకరం పేట కు వచ్చి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. అనంతరం రవీందర్ అంత్య క్రియల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్య క్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తో పాటు పెరుమాళ్ గౌడ్, సుభాష్ గౌడ్, సర్పంచ్లు, సాయి రెడ్డి, రాజు నాయక్ మాజీ ఎంపీటీసీలు, మురళి పంతులు, గోవింద్ రావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయ సాధనకు కృషి

- * ఆచార్య జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ఘన నివాళులు
- * భారతి నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

**రామచంద్రపురం, ఆగస్టు 6 (సిరి న్యూస్):**
తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రతీక ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ 92వ జయంతి సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతి నగర్ డివిజన్ ఎల్ఐజి బస్ స్టాప్ ప్రాంగణంలో గురువారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ చేసిన కృషి, ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు, చూపిన మార్గం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. జయశంకర్ ఆశయాల సాధన ప్రతి తెలంగాణ వాసి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరమేష్ యాదవ్, ఎల్ఐజి సొసైటీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాజా లింగం, సామ్యూల్ జాన్, బీఆర్ఎస్ నాయకులు ఐలేష్ యాదవ్, అరుణ జ్యోతి, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సరిత, రాణి యాదవ్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



# శాస్త్రీయ పురోగతికి అసలైన ఆలోచనలే పునాది

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రామాచారి

**పటాన్ చెరు, ఆగస్టు 6, (సిరి న్యూస్):**





శాస్త్రీయ పురోగతులకు అసలైన ఆలోచనలే పునాది అని, శాస్త్రీయ సాహిత్యాన్ని విస్తృతంగా చదివే అలవాటును పెంపొందించుకుని, జిజ్ఞాస, పట్టుదలతో పరిశోధన చేయాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్, రసాయన శాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ దేవలపల్లి బి. రామాచారి అన్నారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో 'సుస్థిర భవిష్యత్తు కోసం కొత్త ఉత్ప్రేరక 'క్లిక్' చర్యల ఆవిష్కరణ' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామాచారి, ఆధునిక ఉత్ప్రేరక శాస్త్ర పరిణామక్రమాన్ని సదస్యులకు పరిచయం చేశారు. ఆర్గానోక్యాటలిసిస్ అనేది చిన్న సేంద్రీయ అణువులను ఉత్ప్రేరకాలుగా ఉపయోగించి రసాయన చర్యలను వేగవంతం చేస్తుందని, సాంప్రదాయ ఉత్ప్రేరక ప్రక్రియలకు పర్యావరణ అనుకూలమైన, సుస్థిరమైన ప్రత్యామ్నాయాలను అందిస్తుందన్నారు. ఈ ఉపన్యాసంలో ప్రొఫెసర్ రామాచారి అనేక మార్గదర్శక పరిశోధనల గురించి వివరించారు. ఔషధ రసాయన శాస్త్రంతో ఈ అణువుల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. హెచ్ఐవీ ప్రొటీజ్ ఇన్హిబిటర్లు, క్యాన్సర్, క్షయ వ్యాధి నిరోధక మందులు, శిలీంధ్ర, బాక్టీరియా నిరోధక ఏజెంట్లు, హిస్టోన్ డీఎసిటైలేజ్ ఇన్హిబిటర్లు, బయోఆర్థోగోనల్ ప్రోబ్ లలో వీటి అనువర్తనాలను ఆయన ప్రస్తావించారు. తన పరిశోధనా ప్రస్థానం నుంచి పొందిన అంతర్దృష్టులను పంచుకుంటూ, కేవలం పరిశోధనా పత్రాలను ప్రచురించడం కంటే వినూత్న భావనలు మరింత విలువైనవని ప్రొఫెసర్ రామాచారి స్పష్టీకరించారు. పీహెచ్.డీ. ఆవిష్కరణలకు, ప్రభావవంతమైన పరిశోధనలకు గొప్ప అవకాశాలను కల్పిస్తుందంటూ, పోస్టు గ్రాడ్యుయేట్ చదువుల తరువాత కూడా తమ విద్యా ప్రయాణాన్ని కొనసాగించాలని ఆయన వర్ధమాన శాస్త్రవేత్తలను ప్రేరేపించారు. సదస్యులతో జరిగిన ఒక ఆసక్తికరమైన సంభాషణలో, ఇప్పటికే ఉన్న భావనలను మెరుగుపరచడంలో భారతీయ పరిశోధకులు అసాధారణ నైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ, మౌలిక ఆవిష్కరణలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆలోచనలను రేకెత్తించే కొత్త విషయాలను పంచుకుంటూ, సహనం తనను ఒక పరిశోధకుడిగా, ఉపాధ్యాయుడిగా తీర్చిదిద్దిందని, రసాయన శాస్త్రంపై లోతైన అవగాహన శాస్త్రీయ ఆవిష్కణలలో గొప్ప ప్రశంసను, ఆనందాన్ని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆతిథ్య ఉపన్యాసం, ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ముగిసింది. ఇందులో ప్రొఫెసర్ రామాచారి, ఉత్ప్రేరణ, పరిశోధన పద్ధతులు, రసాయన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు, అధ్యాపక బృందం అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానమిచ్చారు. గీతంలోని మౌలిక సదుపాయాలు, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో దాని నిబద్ధతకు ముగ్ధుడైన డాక్టర్ రామాచారి, శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కాలిఫోర్నియా లోని స్క్రిప్స్ రీసెర్చ్ లాగా గీతం కూడా ఎదిగే సామర్థ్యం కలిగి ఉందని అభిప్రాయపడ్డారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలువురు రసాయన శాస్త్ర అధ్యాపకులతో కలిసి, విశిష్ట వక్తను సత్కరించి, ఆయన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అతిథితో కలిగి గ్రూపు ఫోటో దిగడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం:





- ఎమ్మెల్యే జిఎంఆర్
- పటాన్ చెరు లో ఘనంగా జయంతి వేడుకలు..
- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

**పటాన్ చెరు ఆగస్టు 6, (సిరి న్యూస్):**

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తొలి, మలి విడత ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందిస్తూ, ప్రజల్లో చైతన్యం నింపిన మహోన్నత వ్యక్తిగా జయశంకర్ సార్ చిరస్మరణీయులని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలన్న ఆకాంక్షతో ఆయన చేసిన కృషి, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుల్లో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రగణ్యులని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని పటాన్ చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, అశోక్, వెంకటేష్, షకీల్, ధనరాజ్ గౌడ్, రామ్మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరో కార్య క్రమంలో.. ఇదిలా ఉంటే పటాన్ చెరు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎం డీ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాదిరి పృథ్వీ రాజ్ లు కూడా జయశంకర్ కు నివాళులు అర్పించారు.

# రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం కోసం జీవితాన్ని త్యాగం చేసారు

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు
- జోగిపేటలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



జోగిపేట, ఆగస్టు 06, (సిరి న్యూస్): రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని తొలి, మలి దశ ఉద్యమంలో తనదైన పాత్రను సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పోషించారని అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ లు అన్నారు. జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జోగిపేటలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969లో జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, మలి దశ ఉద్యమంలోనూ తనదైన పాత్రను పోషించారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా 1952లో జరిగిన నాన్‌మల్కీ ఉద్యమంలో సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పనిచేశారన్నారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల ఎన్నో పోరాటాలు చేశారన్నారు. తెలంగాణ ఏర్పాటుపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చారని, రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పుస్తకాలు కూడా రాశారని వారన్నారు. . గల్లీ నుంచి ఢిల్లీ, దేశ విదేశాల వరకు తెలంగాణ ఉద్యమం వ్యాప్తి చెందేలా తనవంతు కృషి చేశారన్నారు. జయశంకర్ అలోచనలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తె లంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు, పోరాటాలు, త్యాగాలను నేటి తరం విద్యార్థులు, యువకులు గుర్తుంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్‌లు తొట్ల రామకృష్ణ, రేఖాప్రవీణ్, జ్యోతి ప్రదీప్‌గౌడ్, నాగరత్నంగౌడ్, మంజుల శ్రీకాంత్, మేఘరాణి సైలానీ, శశిరేఖ అనిల్, శోభ నారాయణ గౌడ్, కో అప్షన్ మెంబర్ ముంతాజ్ బేగం అక్బర్, జీషాన్, టీపీవో నిహాల్‌రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ కు నివాళులు అర్పించిన కలెక్టర్

**పెద్ద శంకరం పేట, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద శంకరంపేట తహ సిల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆచార్య జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అందరికి ఆదర్శ ప్రాయులన్నారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఆర్ ఐ నాగరాజు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కేజిబివీ పాఠశాల ను తనిఖీ చేసిన కలెక్టర్అ నంతరం కలెక్టర్ ప్రతిమా సింగ్ పట్టణం లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యా బోధన చేస్తున్న తీరు, భోజనం అందుతున్న తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు.







# జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.
- చిట్కుల్ గ్రామంలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ.
- ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు... ప్రజలు





**పటాన్ చెరు, ఆగస్టు 6, (సిరి న్యూస్):**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలనీ పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్, ఆంజనేయులు, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మేరాజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో వార్డు అభివృద్ధికి శ్రీకారం

- 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**గుమ్మడిదల, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

పగుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డులో సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులను చేపట్టడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు సోనీ శేఖర్ రెడ్డి, నర్సంపల్లి రాజిరెడ్డి, అభిషేటి రాజశేఖర్, వరలక్ష్మి, నాయకులు కృష్ణ, మురళి, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యాదిరెడ్డి, లింగం, మహిళా సంఘం అధ్యక్షురాలు మరియు స్థానిక మహిళలు పాల్గొని పనులను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయిన అనంతరం వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలు తొలగిపోవడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళా సంఘం సభ్యులు, యువకులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తల్లి పాల వారోత్సవాలు..




**వెల్దుర్తి,ఆగస్ట్ 06,(సిరి న్యూస్):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరిలా గ్రామంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బంజా లావణ్య రవి ఆధ్వర్యంలో కొనసాగించారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ పసి పిల్లలకు అమ్మ ఉగ్గుపాలు శ్రేష్టమైనవని, అమ్మపాలు త్రాగడం వలన పసి పిల్లలు బలిష్టంగా తయారవుతారని, మంచి జ్ఞానం, మేధాశక్తి పెంపొందుతుందని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన ఎలాంటి వ్యాధులు రావని వ్యాధి నిరోధక శక్తి ఉత్పన్నమవుతుందని అన్నారు. ఇందులో గ్రామ ఉప సర్పంచ్ నవీన్ పాలకవర్గం సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

## జిన్నారంలో బోనాల కోలాహలం

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**జిన్నారం ఆగస్టు 06 సిరి న్యూస్**

జిన్నారం పురపాలక పరిధిలో ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు, ఉదయం నుంచి ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన గ్రామ పరిసరాలు, నైవేద్య సమర్పణ డప్పు వాయిద్యాలు శివసత్తుల శిగాలు పోతరాజుల విన్యాసాల నడుమ గ్రామానికి చెందిన మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిపై బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయాకటాక్షాలతో జిన్నారం పురపాలిక ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో చల్లగా ఉండాలి పాడిపంటలు సమృద్ధిగా పండి నియోజకవర్గ సస్యశ్యామలం కావాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ ముదిరాజ్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేందర్ రెడ్డి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతికగా పోచమ్మ తల్లికి బోనాలు

- పోచ్మమ తల్లి ఆలయంలో భక్తుల సందడి
- నవచైతన్య మాల సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పణ



**గుమ్మడిదల, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాలను గుమ్మడిదల నవచైతన్య మాల సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం, భక్తి భావాన్ని పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలను ప్రతి ఒక్కరూ ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు. నవచైతన్య మాల సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది పోచమ్మ తల్లి ఆశీస్సులతో బోనాల ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, సదానంద్ రెడ్డి, నవచైతన్య మాల సంఘం సభ్యులు, కర్రెమోల వెంకటయ్య, నీరుడి శేఖర్, నీరుడి రమేష్, మైసయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల హక్కులు

- ప్రొఫెసర్ జీవితాన్ని అంకితం చేశారు
- శాంతియుత, సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి




**సంగారెడ్డి, సిరి న్యూస్:**

తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, 1934 ఆగస్టు 6న జన్మించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, స్వాభిమానం, సమాన అభివృద్ధి కోసం అంకితం చేశారని తెలిపారు. ఆయన కేవలం విద్యావేత్త మాత్రమే కాకుండా తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, గొప్ప ఆలోచనాపరుడిగా, సమాజ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ సమస్యలను చారిత్రక, ఆర్థిక, సామాజిక కోణాల్లో విశ్లేషించి, వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుంచారని తెలిపారు. ఆయన ఉద్యమం ద్వేషానికి కాదు, ప్రజాస్వామ్యానికి, న్యాయానికి, సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని, అందుకే ఆయనను తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా ప్రజలు చిరస్థాయిగా గౌరవిస్తున్నారని పేర్కొన్నారు. జయశంకర్ సార్ బోధించిన విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవ వంటి ఆదర్శాలను యువత ఆచరణలో పెట్టాలని, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు రాజ్యాంగ విలువలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోందని, జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలతో కలిసి శాంతియుత, సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మావతి, ఎస్బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ డానియెల్, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.

## తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శి జయశంకర్

- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**గుమ్మడిదల, ఆగస్టు 6 (సిరి న్యూస్):**



తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా వినిపిస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి, తెలంగాణ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, రాజశేఖర్, కిషన్, నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వెంకటాపూర్(ఆర్)లో నవ దుర్గామాత బోనాల మహోత్సవాలు....







- ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలి.
- ప్రతి ఇంటి నుంచి ఒక బోనం తీసి అమ్మవారికి సమర్పించాలి.
- వెంకటాపూర్ (ఆర్)
- సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి.

**రామాయంపేట, ఆగస్టు 6 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలోని నవ దుర్గామాత ఆలయంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం నుండి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు నవదుర్గామాత బోనాల మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెంకటాపూర్ (ఆర్) సర్పంచ్ వెంకుగారి ఉమా సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆగస్టు 7వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటల నుంచి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటల నుంచి అమ్మవారి కళ్యాణం, ఒడిబియ్యం కార్యక్రమాలు నిర్వహించి, మధ్యాహ్నం 12 గంటల నుంచి హోమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 9వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు ఘటం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమై, ఉదయం 9.30 గంటల నుంచి బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక బోనం తీసుకుని అమ్మవారికి సమర్పించాలని, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా నిర్వహించి విజయవంతం చేయాలని సర్పంచ్ వెంకుగారి ఉమా సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.

## తెలంగాణ స్ఫూర్తి ప్రధాత జయశంకర్ సార్.!

- జయశంకర్ సార్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం.
- తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.
- మెదక్ జిల్లా ఎస్పీ. డి.వి శ్రీనివాస రావు.

**మెదక్ ఆగష్టు,06(సిరి న్యూస్)**





తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని గురువారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషి,అందించిన సేవలను ఎస్పీ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేశారని, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు సందీప్ రెడ్డి,జర్జ్, ఆర్ఐ శైలేందర్, పోలీస్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

## ఆదర్శ ప్రాయులు జయశంకర్ సార్





- ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలి.
- ఘనంగా ప్రొఫెసర్ 92వ జయంతి వేడుకలు.
- డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్.

**మెదక్ ఆగష్టు,06(సిరి న్యూస్)**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు.గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి ఘనంగా నిర్వహించారు.జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, డాక్టర్ శివదయాల్,ఇతర జిల్లా అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, భావజాలం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అదే విధంగా, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ హాజరై, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఉపేందర్రెడ్డి ల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో విషాదం.. చెరువులో పడి ఆరేళ్ల బాలుడి మృతి..

- శిఖరం ప్రిస్కూల్ నుంచి బయటకు వెళ్లిన చిన్నారి చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కొల్లూరు పోలీసులు



**రామచంద్రపురం, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

తెల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శిఖరం ప్రిస్కూల్‌లో గురువారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాఠశాలకు వచ్చిన ఆరేళ్ల బాలుడు షణ్ముక్ సమీపంలోని మేళ్ల చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం బాలుడి తండ్రి ఉదయ్ కిరణ్ తన కుమారుడు షణ్ముక్‌ను శిఖరం ప్రిస్కూల్‌లో దింపి వెళ్లారు. పాఠశాలలో బోనాల వేడుకలు జరుగుతున్న సమయంలో బాలుడు స్కూల్ నుంచి బయటకు వెళ్లినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత బాలుడు పాఠశాలలో కనిపించకపోవడంతో స్కూల్ సిబ్బంది గాలింపు చేపట్టగా, పాఠశాల ఎదురుగా ఉన్న మేళ్ల చెరువులో బాలుడు పడిపోయి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే స్కూల్ సిబ్బంది బాలుడిని చికిత్స నిమిత్తం ఐరావతి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా కొల్లూరు సీఐ సైదిరెడ్డి మాట్లాడుతూ.. బాలుడు ఆటిజం, న్యూరో డెవలప్‌మెంట్ సమస్యలతో బాధపడుతున్నాడని, దీనికి సంబంధించి థెరపీ కూడా తీసుకుంటున్నట్లు తల్లిదండ్రుల ద్వారా తెలిసిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశామని తెలిపారు. బాలుడు స్కూల్ నుంచి ఎలా బయటకు వెళ్లాడు, చెరువులోకి ఎలా చేరుకున్నాడు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులేమిటనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి స్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కొల్లూరు సీఐ సైదిరెడ్డి వెల్లడించారు.

# బంగారమ్మ తల్లి ఆలయంలో వైభవంగా బోనాల సంబరాలు





- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

**గుమ్మడిదల, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

ఆషాఢ మాసం సందర్భంగా గుమ్మడిదల పురపాలక సంఘం కేంద్రంలోని మన్నెగూడెంలో వెలసిన శ్రీ బంగారమ్మ తల్లి ఆలయంలో గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయాన్ని రంగురంగుల తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించగా, భక్తుల రాకపోకలతో సందడి నెలకొంది. సాయంత్రం మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పసుపు, కుంకుమ, వేపాకులు, పూలతో అందంగా అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని వేడుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. పూజారులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల ఉత్సవాల సందర్భంగా మన్నెగూడెం కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, గ్రామస్థులు భక్తి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల మాధవి, 13వ వార్డు కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు మద్దేటి బాలరాజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కావలి ప్రభాకర్ యాదవ్, వీరస్వామి యాదవ్, మల్లేష్ యాదవ్, పోతర్ల రాములు, రాజేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ జయశంకర్

- తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన దార్శనికుడు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జయశంకర్ జయంతి వేడుకలు



**సంగారెడ్డి, ఆగస్టు 6 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి, తన జీవితాన్ని తెలంగాణ ప్రజల హక్కుల కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక, సామాజిక, ఆర్థిక ఆధారాలతో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా మేధావి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సైద్ధాంతిక దిశానిర్దేశం చేసిన ఆయన రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు ఉద్యమానికి అపారమైన మేధోబలాన్ని అందించాయని పేర్కొన్నారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, సమానత్వం, ప్రాంతీయ న్యాయం, సామాజిక చైతన్యంపై చేసిన అధ్యయనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు దిక్సూచి





- ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి.
- మాజీ మున్సిపల్ చైర్మన్ లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి.

**మెదక్ ఆగష్టు,06(సిరి న్యూస్)**

తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించి, రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని మాజీ మున్సిపల్ చైర్మన్ లు ఆరేళ్ల.మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి పిలుపునిచ్చారు.ఆయన జయంతి సందర్భంగా మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్నే త్యాగం చేసి, ఉద్యమానికి చివరి శ్వాస వరకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఉద్యమ నిర్మాణంలో కేసీఆర్‌కు వెన్నంటి నిలిచి తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ సార్ పేరు పెట్టడంతో పాటు, ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించేలా నిర్ణయం తీసుకోవడం ఆయనపై ఉన్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. జయశంకర్ సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ జుబేర్,అహ్మద్,దీపక్ కుమార్, నాయకులు కృష్ణ గౌడ్ ప్రభు రెడ్డి, కేవల్. జగదీష్ మోచి. కిషన్ సాదిక్, ఇందాద్,లక్ష్మణ్ ఇస్మాయిల్, సాయి, కిరణ్,శీను నాయక్,రంజిత్ నాయక్, ఎంబిపూర్ మహేష్,రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# పెయింటింగ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం



- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదలు ఆగస్టు 6 (సిరి న్యూస్):**

పెయింటింగ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం గుమ్మడిదల మండల పెయింటింగ్ కార్మికుల యూనియన్ సభ్యులు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పెయింటింగ్ కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన ప్రతి సందర్భంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, సదానంద్ రెడ్డి, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు కృష్ణవంశీ, ఉపాధ్యక్షుడు నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యదర్శిలు శివకుమార్,శీతల నర్సింలు, కోశాధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయు పీజీ కళాశాలలో జయశంకర్ జన్మదిన వేడుకలు



**నర్సాపూర్ ఆగస్టు 06 (సిరి న్యూస్)**

ఆచార్య జయశంకర్ 92 వ జన్మదిన సందర్భంగా గురువారం ఓయు పీజీ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ జీవితం తెలంగాణకే అంకితం చేశారని తెలంగాణ రాష్ట్ర సాకారం కోసం ఆయన విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ ఆయన అడుగు జాడలలో నడవాలని అన్నారు, అధ్యాపకులు, విద్యార్థులు ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ యాట ప్రవీణ్ కుమార్ డాక్టర్ సల్వా రెడ్డి, డాక్టర్ మోహన్ బోధనేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్న పత్రికల సమస్యలపై సమాచార కమిషనర్ కు వినతి

**విజయవాడ, ఆగస్టు 6 :**

రాష్ట్రంలోని చిన్న పత్రికలు పీరియాడికల్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి సమాచార శాఖ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా చిన్న దినపత్రికలు పీరియాడికల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. చిన్న పత్రికలు పీరియాడికల్స్ విస్తరణకు, సదుపాయాల కల్పనకు ఉపయోగపడే రీతిలో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అవసరమని వివరించారు. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్న పత్రికలకు 30 శాతం ప్రకటనలు ఇవ్వాలని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. పత్రికల రెగ్యులారిటీకి జాతీయస్థాయిలో సమాచార శాఖ అనుసరిస్తున్న పద్ధతిని పాటించాలని కోరారు. వీఐపీలు, ప్రముఖ వ్యక్తులు పర్యటనలకు విచ్చేసిన సందర్భంలో, ప్రధాన సంఘటనలు జరిగిన సందర్భంలో చిన్న పత్రికల జర్నలిస్టులకు వార్తల కవరేజీ విషయంలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై వివరంగా తెలుసుకున్న డైరెక్టర్ ఆ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. సమాచార శాఖ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా చిన్న దినపత్రికలు పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి హుస్సేన్ ఖాన్, కే.కలిమిశ్రీలు ఉన్నారు.

# మైనారిటీ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

**అమరావతి, ఆగస్టు 6**

మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన,ఉన్నత విద్య కు తోడ్పాటు అందిస్తూ ప్రోత్సాహం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,కంప్యూటర్ అవగాహన శిక్షణ కార్యక్రమంలో మూడవ రోజు కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ పర్యవేక్షణలో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది 60 మందికి అమరావతిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ప్రధాన కార్యాలయంలో శిక్షణ జరుగుతోంది.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ శిక్షణ పొందుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఉర్దూ అకాడమీ 1975లో విద్యా శాఖకు అనుబంధంగా ఏర్పాటైందన్నారు.1993 లో మైనారిటీల సంక్షేమ శాఖ ఏర్పాటు అయ్యాక ఉర్దూ అకాడమీని, మైనారిటీ సంక్షేమశాఖ క్రిందికి చేర్చడం జరిగింది అన్నారు.. ఉమ్మడి రాష్ట్రంలో తాను గతంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నపుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉర్దూ అకాడమీ క్రింద కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి గుర్తుచేశారు.ప్రస్తుతం అత్యంత సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం కలిగిన కంప్యూటర్లను కొనుగోలు చేసి రాష్ట్రంలోని 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
శుక్రవారం
ఆగస్టు-07-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 208
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5



## రూ. 5.49 కోట్లతో సిద్దిపేట జనరల్ ఆస్పత్రి అభివృద్ధి

5

- అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు ఆమోదం
- వైద్యుల నిర్లక్ష్యంపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం





# ఎన్నికల ముందు ఎన్నికల తర్వాత రాజిరెడ్డే!




ప్రజల్లోనే నిత్యం నిలుస్తున్న ఏకైక నియోజకవర్గ ఇన్చార్జ్

## రెండేళ్లలోనే మారిన నర్సాపూర్ రాజకీయ చిత్రం

- ప్రతి గడపకూ విస్తరించిన ఆయన సేవలు
- పార్టీలకతీతంగా కార్యకర్తలతో పక్కా కమ్యూనికేషన్
- ఇతర పార్టీల సర్పంచులు అడిగిన వెంటనే నిధులు మంజూరు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేసిన ధీరుడు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద పట్టున్న నేత
- నర్సాపూర్ నియోజకవర్గ పూర్తి బాధ్యతలు రాజిరెడ్డి చేతుల్లోనే
- అనూహ్య పోటీ నుంచి తిరుగులేని గుర్తింపు వరకు

3

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆవుల రాజిరెడ్డి పేరు, ఆయన ముఖ పరిచయం ఎన్నికల సమయానికి నియోజకవర్గంలో చాలామందికి సరిగ్గా తెలియదు. అయినా సరే, ఎన్నికల రేసులో హోరాహోరీగా పోరాడి కేవలం 8వేల ఓట్ల స్వల్ప మెజార్టీతో మాత్రమే ఓటమి పాలై అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఆ ఎన్నికల తర్వాత గడిచిన రెండేళ్ల కాలంలో నర్సాపూర్ రాజకీయం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజిరెడ్డి పేరు తెలియని ఊరు లేదు, ఆయనను గుర్తుపట్టని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పర్యటిస్తున్న ఏకైక నియోజకవర్గ ఇన్చార్జ్‌గా ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

- (ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)



- ఏం భయంలేదంటూ భరోసా కల్పించిన జగ్గారెడ్డి
- తన కారులో తల్లీబిడ్డను ఎక్కించుకుని ఎంసీహెచ్‌లోని పసిపిల్లల వార్డుకు తీసుకెళ్లిన నేత
- వెంటనే వైద్యం అందేలా డాక్టర్లతో మాట్లాడిన వైనం
- వ్యాక్సిన్ వల్ల ఫిట్స్ వచ్చినట్లు గుర్తించి.. బాధితులకు ఊరట

### ఆరోగ్యం బాగోలేని చంటిపాపను ఎత్తుకొని అర్ధరాత్రి ఆస్పత్రికొచ్చిన తల్లి

సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి ఒంటి గంటకు తీవ్ర వేదనతో ఉన్న ప్రవళికను పలకరింపు

# జగ్గన్న మానవత్వం !

అప్పటివరకు బాగానే ఉన్న నాలుగు నెలల పసికందు ఒక్కసారిగా ఉలుకూ పలుకూ లేకుండా పోవడంతో దిక్కుతోచని స్థితిలో అర్ధరాత్రి ఆస్పత్రికి వెళ్లిన ఓ తల్లికి జగ్గారెడ్డి అండగా నిలిచారు. అత్తామామ ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితం కాగా, డ్రైవరుగా పనిచేస్తున్న భర్తకు ఫోన్ చేస్తే స్పందన లేకపోవడంతో ప్రవళిక అనే మహిళ రాపిడోలో ఆటో బుక్ చేసుకుని అర్ధరాత్రి ఒంటి గంట వేళ సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. ఏ వార్డుకు వెళ్లాలో తెలియక, చంటిబిడ్డతో ఆస్పత్రి ప్రాంగణంలోని మహిళల వార్డు వద్ద దిగాలుగా నిలబడింది. అదే సమయంలో ఆస్పత్రికి ఆకస్మిక తనిఖీకి వచ్చిన జగ్గారెడ్డి మహిళా వార్డును పరిశీలిస్తూ పసికందును ఎత్తుకుని తీవ్ర వేదనతో ఉన్న ప్రవళికను చూసి చలించిపోయారు. ఏమైందమ్మా అంటూ ఆమెను ఆప్యాయంగా పలకరించారు. తన బిడ్డ చాలా సేపటి నుంచి ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయిందని, అందుకే తానొక్కదాన్నే రాత్రి పూట ఆస్పత్రికి వచ్చానని ఆమె తన గోడును వెళ్లగక్కింది. -సంగారెడ్డి, (సిరి న్యూస్)



4

## బృందావన్ కాలనీలో ప్రజల నరకయాతన

- 15 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నా మౌలిక వసతులు కరవు
- ఎల్ఆర్ఎస్, హెచ్ఎండీఏ అనుమతులతో ఇళ్లు నిర్మాణం
- క్రమం తప్పకుండా హౌస్ ట్యాక్స్‌లు చెల్లిస్తున్నప్పటికీ కాలనీవాసులు
- వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో అల్లాడిపోతున్న ప్రజలు
- రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కల్పించాలని కలెక్టర్‌కు వినతి

2







# జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రోహిత్ రావు

## అంబేద్కర్, వివేకానంద సర్కిళ్ల అభివృద్ధికి శంకుస్థాపన – జయశంకర్ ఆశయాలను బావి తరాలకు చాటాలి

రామాయంపేట, ఆగష్టు 6 (సిరి న్యూస్) రామాయంపేట రామాయంపేట పట్టణంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట రోడ్డులో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం తదితరులతో కలిసి ఎమ్మెల్యే విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని సిద్దిపేట చౌరస్తాలో వివేకానంద విగ్రహం ప్రాంతం, మెదక్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాంతాల్లో నూతన సర్కిళ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పనుల్లో భాగంగా విగ్రహాల చుట్టూ ఆధునిక వాటర్ ఫౌంటెన్లు, గార్డెనింగ్, అలంకరణ లైటింగ్, సుందరీకరణ పనులు చేపట్టి పట్టణ ప్రధాన కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు పట్టణ సౌందర్యాన్ని మరింత పెంచేలా ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గజవాడ నాగరాజు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో రామాయంపేటలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. పట్టణ సుందరీకరణతో పాటు రహదారులు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రామాయంపేటను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. ఆయన కలలుగన్న సమానత్వ తెలంగాణ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, కౌన్సిలర్లు దేవుని రంజిత్, పుట్టి సందీప్, రవి నాయక్, కో ఆప్షన్స్ సభ్యుడు దేమే యాదగిరి, చింతల రాధా భవాని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం, పట్టణ అధ్యక్షులు పచ్చంటి రాము, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూనా రవి, మెదక్ పట్టణ అధ్యక్షులు ఏలేశ్వరం బ్రహ్మచారి, వేణు చారి, మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు)అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సరాఫ్ ప్రశాంత్, కోశాధికారి మైలారం వేణు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల స్వామి, డాకి స్వామి, శ్రీధర్ రెడ్డి, స్వర్ణకార



సంఘం ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బృందావన్ కాలనీలో ప్రజల నరకయాతన

- 15 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నా మౌలిక వసతులు కరవు
- ఎల్ఆర్ఎస్, హెచ్ఎండీఏ అనుమతులతో ఇళ్లు నిర్మాణం
- క్రమం తప్పకుండా హౌస్ ట్యాక్స్‌లు చెల్లిస్తున్నప్పటికీ కాలనీవాసులు
- వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో అల్లాడిపోతున్న ప్రజలు
- రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కల్పించాలని కలెక్టర్‌కు వినతి





సంగారెడ్డి, సిరి న్యూస్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగరీత్యా జిల్లా కేంద్రానికి వచ్చి బృందావన్ కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకుని స్థిరపడినట్లు నివాసితులు తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి అప్పట్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఎల్ఆర్ఎస్ చెల్లించి, హైదరాబాద్ నుంచి హెచ్ఎండీఏ అనుమతి తెచ్చుకుని, మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ పర్మిషన్ తీసుకుని ఇండ్లు నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. అందరం ఉద్యోగస్తులమే కావడంతో బ్యాంకుల చుట్టూ తిరిగి రుణాలు తీసుకుని ఇళ్లు కట్టుకున్నామని, అప్పటినుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా హౌస్ టాక్స్ రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని వారు స్పష్టం చేశారు. అంతేకాకుండా తమ కాలనీలో కొందరు పెద్దలు సామాజిక స్పృహ కలిగి, ఉపాధ్యాయ వృత్తి నుండి వచ్చినవారు కావడం వల్ల చెట్లు నాటడాన్ని బాధ్యతగా తీసుకుని సంగారెడ్డిలో ఏ కాలనీలో లేనన్ని మొక్కలు నాటామని గుర్తుచేశారు. అయితే, ఇంతటి పచ్చదనం ఉన్న తమ కాలనీని అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రస్తుతం కాలనీలో రోడ్లు సరిగా లేక వర్షాకాలంలో బురదమయంగా, ఎండాకాలంలో దుమ్ముతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్లు సరిగా లేకపోవడం వల్ల పిల్లలు పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని, మహిళలు కనీసం బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొందని తెలిపారు. అలాగే కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరు నిలబడి దోమలు చేరి అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, తమ కాలనీని పరిశీలించి దయతో తక్షణమే సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణ న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు కాలనీ వాసులు కోరారు.



# ఎన్నికల ముందు ఎన్నికల తర్వాత రాజిరెడ్డే!



## రెండేళ్లలోనే మారిన నర్సాపూర్ రాజకీయ చిత్రం

- ప్రజల్లోనే నిత్యం నిలుస్తున్న ఏకైక నియోజకవర్గ ఇన్చార్జ్
- ప్రతి గడపకూ విస్తరించిన ఆయన సేవలు
- పార్టీలకతీతంగా కార్యకర్తలతో పక్కా కమ్యూనికేషన్
- ఇతర పార్టీల సర్పంచులు అడిగిన వెంటనే నిధులు మంజూరు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేసిన ధీరుడు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద పట్టున్న నేత
- నర్సాపూర్ నియోజకవర్గ పూర్తి బాధ్యతలు రాజిరెడ్డి చేతుల్లోనే
- అనూహ్య పోటీ నుంచి తిరుగులేని గుర్తింపు వరకు

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆవుల రాజిరెడ్డి పేరు, ఆయన ముఖ పరిచయం ఎన్నికల సమయానికి నియోజకవర్గంలో చాలామందికి సరిగ్గా తెలియదు. అయినా సరే, ఎన్నికల రేసులో హోరాహోరీగా పోరాడి కేవలం 8వేల ఓట్ల స్వల్ప మెజార్టీతో మాత్రమే ఓటమి పాలై అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఆ ఎన్నికల తర్వాత గడిచిన రెండేళ్ల కాలంలో నర్సాపూర్ రాజకీయం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజిరెడ్డి పేరు తెలియని ఊరు లేదు, ఆయనను గుర్తుపట్టని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పర్యటిస్తున్న ఏకైక నియోజకవర్గ ఇన్చార్జ్‌గా ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

- (ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

### రేవంత్‌రెడి వద్ద తిరుగులేనీ పట్టు

ఇటీవల జరిగిన నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో రాజిరెడ్డి తన రాజకీయ చాతుర్యాన్ని, మార్కును స్పష్టంగా చాటుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ టికెట్ల బి-ఫారాలు మొత్తం రాజిరెడ్డి చేతుల మీదుగానే పంపిణీ జరగడం, ఆయన పక్కా వ్యూహంతో నర్సాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగరేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో ఆయన 100కు 100 మార్కులు సాధించారు.

### స్థానిక పోరుకు సిద్ధం

ప్రస్తుతం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యతలు పూర్తి స్థాయిలో రాజిరెడ్డి చేతుల్లోనే ఉన్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆచితూచి గెలుపు గుర్రాలైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ బిఫారాలు కూడా పూర్తిగా రాజిరెడ్డి మీదుగానే ఇచ్చేలా అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. అన్ని వర్గాలు, అన్ని పార్టీల నేతల మద్దతు కూడగట్టుకుంటూ ముందుకు దూసుకెళ్తున్నారు.











### ప్రతి గడపకూ రాజిరెడ్డి సేవలు

ఏమాత్రం హడావుడి చేయకుండా, బయటకు తెలియనివ్వకుండా తెలివిగా తన పనులను చక్కబెట్టుకుంటూ రాజిరెడ్డి ముందుకు సాగుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో చాపకింద నీరులా ప్రతి గడపకూ ఆయన సేవలు విస్తరించాయి. పార్టీలతో సంబంధం లేకుండా ఇంటర్నల్‌గా బీఆర్ఎస్, బీజేపీకి చెందిన సర్పంచులు, స్థానిక నేతలు, క్రియాశీల కార్యకర్తలతో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇమేజ్‌తో పాటు తన సొంత వ్యక్తిగత గ్రాఫ్, ఇమేజ్‌ను సమాంతరంగా పెంచుకుంటూ రాజిరెడ్డి పొలిటికల్ గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు.

### ఇతర పార్టీల నేతల అభిమానం

రాజిరెడ్డి అనుసరిస్తున్న వ్యూహాలు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను సైతం ఆకట్టుకుంటున్నాయి. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధికి ఫండ్స్ కావాలని కోరగానే, ఎలాంటి పక్షపాతం లేకుండా వెంటనే సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయించి వారి మనసులను గెలుచుకున్నారు. దీంతో అన్ని పార్టీల్లోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు తయారయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఆయన సొంత గ్రామం వేరే నియోజకవర్గంలోకి వెళ్లినప్పటికీ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నర్సాపూర్ నుంచే పోటీ చేసే దిశగా పక్కా ఆలోచనలతో అడుగులు వేస్తున్నారు.





అప్పటివరకు బాగానే ఉన్న నాలుగు నెలల పసికందు ఒక్కసారిగా ఉలుకూ పలుకూ లేకుండా పోవడంతో దిక్కుతోచని స్థితిలో అర్ధరాత్రి ఆస్పత్రికి వెళ్లిన ఓ తల్లికి జగ్గారెడ్డి అండగా నిలిచారు. అత్తామామ ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితం కాగా, డ్రైవరుగా పనిచేస్తున్న భర్తకు ఫోన్ చేస్తే స్పందన లేకపోవడంతో ప్రవళిక అనే మహిళ రాపిడోలో ఆటో బుక్ చేసుకుని అర్ధరాత్రి ఒంటి గంట వేళ సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. ఏ వార్డుకు వెళ్లాలో తెలియక, చంటిబిడ్డతో ఆస్పత్రి ప్రాంగణంలోని మహిళల వార్డు వద్ద దిగాలుగా నిలబడింది. అదే సమయంలో ఆస్పత్రికి ఆకస్మిక తనిఖీకి వచ్చిన జగ్గారెడ్డి మహిళా వార్డును పరిశీలిస్తూ పసికందును ఎత్తుకుని తీవ్ర వేదనతో ఉన్న ప్రవళికను చూసి చలించిపోయారు. ఏమైందమ్మా అంటూ ఆమెను ఆప్యాయంగా పలకరించారు. తన బిడ్డ చాలా సేపటి నుంచి ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయిందని, అందుకే తానొక్కదాన్నే రాత్రి పూట ఆస్పత్రికి వచ్చానని ఆమె తన గోడును వెళ్లగక్కింది.

సంగారెడ్డి, ఆగస్టు 6 (సిరి న్యూస్):



# జగ్గన్న మానవత్వం !

## ఆరోగ్యం బాగోలేని చంటిపాపను ఎత్తుకొని అర్ధరాత్రి ఆస్పత్రికొచ్చిన తల్లి

### సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి ఒంటి గంటకు తీవ్ర వేదనతో ఉన్న ప్రవళికను పలకరింపు

- ఏం భయంలేదంటూ భరోసా కల్పించిన జగ్గారెడ్డి
- తన కారులో తల్లీబిడ్డను ఎక్కించుకుని ఎంసీహెచ్‌లోని పసిపిల్లల వార్డుకు తీసుకెళ్లిన నేత
- వెంటనే వైద్యం అందేలా డాక్టర్లతో మాట్లాడిన వైనం
- వ్యాక్సిన్ వల్ల ఫిట్స్ వచ్చినట్లు గుర్తించి.. బాధితులకు ఊరట





### కారులో ఎక్కించుకుని ఎంసీహెచ్‌కు తరలింపు..

బాధలో ఉన్న ప్రవళిక పరిస్థితిని అర్థం చేసుకున్న జగ్గారెడ్డి వెంటనే మానవత్వం చాటుకున్నారు. మహిళల వార్డు నుంచి ఎంసీహెచ్ వరకు తన కారులోనే తల్లీబిడ్డలను ఎక్కించుకుని తీసుకెళ్లారు. రెండో అంతస్తులో ఉన్న పసిపిల్లల వార్డు వరకు స్వయంగా వెళ్లిన ఆయన.. పాప ఆరోగ్యం బాగాలేని విషయాన్ని డాక్టర్లకు వివరించి వెంటనే చికిత్స ప్రారంభించాలని ఆదేశించారు.

### తల్లీబిడ్డకు దక్కిన ఊరట..

జగ్గారెడ్డి చొరవతో వైద్యులు తక్షణమే అప్రమత్తమై చికిత్స అందించడంతో ఆ తల్లికి ఊరట లభించింది. చిన్నారికి ఇచ్చిన వ్యాక్సిన్ వల్లనే ఫిట్స్ వచ్చినట్లు డాక్టర్లు గుర్తించి సరైన వైద్యం అందించారు. అంతటితో ఆగకుండా డ్రైవింగ్ కోసం వెళ్లిన ప్రవళిక భర్తతోనూ జగ్గారెడ్డి ఫోన్లో మాట్లాడి, పాపకు చికిత్స ప్రారంభమైందని వెంటనే ఆస్పత్రికి రావాలని ధైర్యం చెప్పారు. అర్ధరాత్రి వేళ పసిబిడ్డ ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగున వచ్చిన తల్లికి జగ్గారెడ్డి అండగా నిలిచి భరోసా కల్పించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.





# రూ.5.49 కోట్లతో సిద్దిపేట జనరల్ ఆస్పత్రి అభివృద్ధి

- అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు ఆమోదం
- వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం



సిద్దిపేట, ఆగస్టు 6 (సిరి న్యూస్):

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన గురువారం జరిగిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో రూ.5.49 కోట్ల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు ఆమోదం లభించింది. సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు.ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలను సమగ్రంగా అందించడంలో విఫలమైన సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత అధికారులపై మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో చేరేలా వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి వెంటనే ప్రతిపాదనలు పంపాలని, ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అదనపు నిధుల కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్యాలియేటివ్ కేర్ సేవలపై ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కంటి, వినికిడి లోపాలను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని, జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలను మరింత విస్తరించాలని మంత్రి ఆదేశించారు. అనవసర సీసెక్షన్ ప్రసవాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రిఫర్ చేసే రోగులను ప్రభుత్వ అంబులెన్స్ ద్వారానే తరలించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ కీమోథెరపీ, ప్యాలియేటివ్ కేర్, పీడియాట్రిక్ కేర్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అంబులెన్స్, ఇన్‌పేషంట్ ఆహారం తదితర సేవలు సమర్థవంతంగా అందించాలని సూచించారు. సూపరింటెండెంట్, వైద్యులు క్రమం తప్పకుండా విధులకు హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా ప్రతి అధికారి, వైద్యుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమావేశానికి ముందు తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత షా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ధనరాజ్‌తో పాటు వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.